అడల్ట్స్ ఓన్లీ కథ




# కలవరమాయె మదిలో

'కలవరమాయె మదిలో..నా మదిలో..' అంటూ పాడింది సెల్ ఫోను. రిసీవ్ బటన్ నొక్కి ఎవరు చేసారా అని నంబరు కోసం చూసాడు విహారి. ప్రైవేటు నంబరు అని వుంది.

''హలో'' అంటూ విహారి పలికాడు.

''హలో.. విహారిగారేనా?'' మధురమైన స్త్రీ కంఠస్వరం అడిగింది. పలుకే ఇంత తీయగా వుంటే మనిషి మరెంత అందంగా వుంటుందో! ఇంతకీ ఎవరో ఈమె? అనుకుంటూ ''స్పీకింగ్'' అన్నాడు విహారి.

''హలో, స్వరమే ఇంత తియ్యగా వుంది. మనిషి ఎంత అందంగా వుంటుందో.. ఇంతకీ ఎవరో ఈమె..రాత్రి పదిన్నర గంటలకు నాకు ఎందుకు ఫోను చేసినట్టు? అంటూ ఆలోచనలో పడ్డారా?''



''ఏమిటీ? మనిషిని చూడకుండానే మనసు చదవడం వచ్చా మీకు?'' నవ్వుతూ అడిగాడు విహారి, భార్య నీహారిక ఇంకాసేపటి దాకా వంటింట్లో నుండి రాకపోతే బాగుండుననుకుంటూ.

''మీ మనసు నాకు కాకపోతే ఇంకెవరికి తెలుస్తుంది? ఇంతకీ ఇంత రాత్రప్పుడు మాట్లాడవలసిన ఆ ముఖ్య విషయ మేమిటని అడగరేం?'' గొంతులో అల్లరిని పలికిస్తూ, టీజ్ చేస్తున్నట్టుగా అడిగింది అవతలి నుండి మాట్లాడుతున్న స్త్రీ.

''మీరెవరో గొంతునుబట్టి గుర్తుపట్టలేకపోతున్నాను. పేరు చెప్పలేదు మరి. నాకు చాలా దగ్గరి మనిషిలా కన్పిస్తున్నారు. ఇలా కనబడకుండా సస్పెన్స్‌లో పెట్టకపోతే ఎదురుగా వచ్చి మాట్లాడవచ్చుగా'' విహారి కుతూహలం ధ్వనిస్తున్న గొంతుతో అడిగాడు.

''ఎదురుగా వస్తే నాతో మాట్లాడేంత తీరిక మీకు వుంటుందా?

**డా. కె. మీరాబాయి**

అందుకే మరి ఈ వేళప్పుడు ఫోనులో పట్టుకున్నాను మిమ్మల్ని'' అంటూ కిల కిలా నవ్వింది.

''పట్టుకున్నాను మిమ్మల్ని'' అన్న మాటలు కావాలని శ్లేషతో పలికినట్టనిపించింది విహారికి. ఆ నవ్వులు వింటుంటే చాలా హాయిగా వుంది.

''పోనీలెండి! సంగతేమిటో చెప్పండి'' అన్నాడు స్నేహంగా.

''నేను నెల తప్పాను..'' కాస్త కంగారుగా, సిగ్గుగా ధ్వనించింది ఆమె స్వరం.

విహారి తెల్లబోయాడు ''వ్వాట్? నాకెందుకు చెప్తున్నారు?'' సీరియస్‌గా అడిగాడు. 'ఇదేదో తనను టీజ్ చేయడానికి ఎవరో యువతి పన్నాగంలా వుంది. ఇంటర్‌నెట్‌లు, సెల్‌ఫోన్లు వచ్చాక ఈ రకమైన టీజింగ్, బెదిరింపులు ఎక్కువవుతున్నాయని వింటున్నాంగా' అనుకుంటూ.

''అదేమిటి? కడుపు చేసిన మీకు కాక ఇంకెవరికి చెప్తాను?'' ఆశ్చర్యంగా అని నవ్వేసింది ఆ స్త్రీ.

లైన్ కట్ అయిపోయింది.

నీహారిక లోపలి నుండి బెడ్ రూములోకి వస్తుండటం చూసి సెల్‌ఫోను పక్కన బల్లమీద పెట్టేసి కళ్ళు మూసుకుని పడుకున్నాడు విహారి.

లోపలికి వచ్చిన నీహారిక అతను నిద్రపోతుండటం చూసి నిట్టూర్చింది. మూడురోజుల నుండి ప్రయత్నిస్తోంది అతనితో తీరికగా మాట్లాడాలని. కానీ కుదరడం లేదు. ఇవాళా నిద్రపోయాడు.

మూడు రోజుల క్రితం... అంటే సోమవారం నాడు!

''ఏవండీ! ఇవాళ కాస్త తొందరగా వస్తారా? మనం...'' ఒక చేత్తో టిఫిన్ ప్లేటు పట్టుకుని, మరో చేతితో చీరకొంగుతో ముఖం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చిన నీహారిక, టిఫిన్ ప్లేటు భర్తకందిస్తూ ఏదో చెప్పాలని అంతలో ఆగిపోయింది.

చేతిలోని సెల్‌ఫోనును చెవికతికించుకుని ఏదో చాలా ముఖ్య విషయంలా మాట్లాడుతున్నాడు విహారి. ''ఆ..సాయంత్రం తప్పక కలుద్దాం. అతను నాకు బాగా తెలుసు. కాదనకుండా మీ పని చేసి పెడతాడు'' అంటున్న విహారి చేయి పైకెత్తి నీహారికను ఆగమన్నట్టు సైగ చేసి, టిఫిన్ తన ఎదుట నున్న టీపాయి మీద పెట్టమన్నట్టు చూపించి, తన సంభాషణ కొనసాగించాడు.

చిన్నగా నిట్టూర్చి, పలహారం అతని ఎదుట వుంచి లోపలికి నడిచింది నీహారిక.

హడావుడిగా వంట ముగించి, తొమ్మిదిన్నర కల్లా కారియర్‌లో సర్ది తీసుకొచ్చిన నీహారిక ''ఇవాళ సాయంత్రం మనం బయటకు వెళ్ళాలి..'' అంటూ ఆగిపోయింది.

ఒక చేత్తో తల దువ్వుకుంటూ మరొక చేత్తో సెల్‌ఫోను చెవికి ఆనించుకుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు విహారి-

''అరే మొన్న అనుకున్నాంగా..వైజాగ్ నుండి పార్టీని పిలిపిద్దామని. కాస్త ఖర్చు ఎక్కువే అవుతుంది కానీ వాళ్ళకు చాలా పేరుంది. మన ప్రోగ్రాం తప్పక గ్రాండ్ సక్సెస్ అవుతుంది..ఓ.కె.'' అంటూనే భార్య అందించిన కారియర్ అందుకుని బయటకు నడిచి స్కూటరు స్టార్ట్ చేసాడు.

సెల్‌ఫోను మెడలో వేలాడేటట్టుగా వేసుకుని, కళ్ళతోనే నీహారికకు వీడ్కోలు చెప్పి ముందుకు దూసుకుపోయాడు.

రాత్రి ఏడింటికి ఇంటికి ఫోను చేసి- ''నీహా.. నేను రావడం ఆలస్యమవుతుంది. భోజనం కూడా బయటే చేస్తున్నాను. నాకోసం కాచుకుని కూర్చోక నువ్వు తినెయ్యి'' అన్నాడు విహారి.

''అది కాదండీ..ఇవాళ వస్తానని..'' అంటూ నీహారిక ఏదో చెప్పబోతుండగానే, ''అదిగో ఎవరో ఫోను చేస్తున్నారు. వుంటాను. ఇంటికి వచ్చాక మాట్లాడుకుందాం'' అంటూ ఫోను పెట్టేసాడు.

అన్నట్టుగానే రాత్రి పదిగంటలకు వచ్చాడతను. లోపలికి రాగానే ''పిల్లలుగానీ ఫోను చేశారా?'' అని అడిగి, జవాబు కోసం చూడకుండానే ఏదో నంబరు నొక్కి సెల్‌ఫోనులో మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

సెల్ ఫోను తీసి విసిరేయాలన్నంత కోపం వచ్చింది నీహారికకు. ఏమీ మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళి ఫ్రిజ్‌లో పెట్టాల్సినవి పెట్టేసి, పాలు తోడు పెట్టి, గ్యాస్ స్టౌ కడిగి, వంటిల్లు శుభ్రం చేసుకుని పడక గదిలోకి వచ్చింది.

ఆసరికి విహారి నిద్రలోకి జారుకున్నాడు. సన్నగా గురక కూడా వినబడుతూంది.


పేపరు, పెన్ను తీసుకుని- ''సాత్విక్‌కి ఎల్లుండి నుండి పరీక్షలట...ఫోను చేసి శుభాకాంక్షలు తెలుపండి. అలాగే చిన్నవాడు సాగర్‌కి కూడా ఫోను చేయండి'' అని రాసి ఆ కాగితం బల్లమీది సెల్‌ఫోను క్రింద పెట్టి, అతనికి నిద్రాభంగం కలగకుండా పక్కకు జరిగి తనూ పడుకుంది నీహారిక.

మంగళవారం ఉదయాన్నే లేచిన నీహారిక తలస్నానం చేసి వచ్చి కాఫీ కలిపి ఫ్లాస్క్‌లో పోసి పెట్టి, ఉప్మా తయారుచేస్తుంటే, ముఖం కడుక్కుని టవలుతో తుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చాడు విహారి.

''సమ్ముఖంలో శ్రీముఖాలెందుకు? నాకు నేరుగా చెప్పవచ్చును కదా! నిన్న ఇంటికి రాగానే అడిగాను కూడా..'' అన్నాడు ఫ్లాస్క్‌లోని కాఫీ మగ్‌లోకి వంచుకుంటూ.

## అదృష్టం

'వర్షం సినిమా నా ఫిల్మ్ కెరీర్‌నే మార్చేసింది. గొప్ప దర్శకులు, మంచి నటుల సరసన నటించే అవకాశం నాకు దక్కింది' అంటోంది త్రిష. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు కొత్తచిత్రంలో యంగ్ హీరో నితిన్ సరసన నటిస్తున్న త్రిష తన కెరీర్‌ని చాలా ప్లాన్డ్‌గా ముందుకి తీసుకుపోతున్నట్టు కన్పిస్తోంది. 'నితిన్‌తో కలిసి నటించడం మంచి అనుభవం' అని ఆనందంతో చెబుతున్న త్రిష బిజీగా ఉంది ప్పుడు.



'నేను జవాబు చెప్పేంతలో మీరు సెల్‌ఫోనులో మాట్లాడ్డం మొదలుపెట్టారు. రాత్రి పడుకునే ముందు చెబుదామంటే నిద్రపోయారు' అని చెప్పాలని అతని వైపు తిరిగింది నీహారిక.

కానీ ఆసరికే విహారి కాఫీ మగ్ పట్టుకొని, కొడుకుతో సెల్‌ఫోనులో మాట్లాడుతూ ముందు గదిలోకి వెళ్ళిపోయాడు.

విహారి-నీహారిక దంపతులకు ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు సాత్విక్‌కి పదహారేళ్లు. ఇంటరు ఫస్టియర్ చదువుతున్నాడు. ఐ.ఐ.టి.కి, ఎమ్.సెట్‌కి కూడా కోచింగ్ ఇస్తారని ఒక పేరొందిన ప్రైవేటు కాలేజీలో చేర్పించడం వల్ల హైదరాబాద్‌లో ఆ కాలేజి వాళ్ళ హాస్టల్లోనే వున్నాడు. రెండోవాడు సాగర్‌కి పదేళ్లు. ఆరో క్లాసు చదువుతున్నాడు. స్కూలుకు నాలుగు రోజులు సెలవు వస్తే అనంతపురం తాతగారింటికి వెళ్ళాడు.

నీహారికకు ఎమ్మే డిగ్రీ వున్నా ఉద్యోగం చేయడం లేదు. ఏవో సాంఘిక కార్యకలాపాలలో పాలు పంచుకుంటూ, ఇల్లు చక్కబెట్టుకోవడం, చక్కని పూలతోట పెంచడం ముఖ్యమైన కాలక్షేపంగా గడుపుతుంది.

భర్తతో విషయం ఎలా చెప్పాలో, అతను ఎలా రియాక్ట్ అవుతాడో అని టెన్షన్ పడుతూంది నీహారిక. అతనితో తీరికగా మాట్లాడడానికి సమయం దొరకడం లేదు.

కొడుకులిద్దరితో మాట్లాడ్డం కాగానే గబగబా తయారై టిఫిన్ తినేసి ''నాకోసం హడావుడి పడి వంట చేయకు. ఇవాళ తొందరగా వెళ్ళాలి'' అంటూ బయల్దేరాడు. స్కూటర్ స్టార్ట్ చేసాక కూడా ఎవరితోనో సెల్‌ఫోనులో మాట్లాడుతూనే వున్నాడు.

'బండి నడుపుతూ ఆ మాటలేమిటో... అసలే అతను వెళ్ళేదారి రద్దీగా వుంటుంది. పోలీసు చూసాడంటే ఫైను అడుగుతాడు' అనుకుంటున్న నీహారికకు ఈరోజు కూడా అసలు విషయం అతనికి చెప్పలేనేమో అనిపించి నిస్పృహగా అనిపించింది.

'అసలు ఈ సెల్‌ఫోను వచ్చినప్పటినుండీ తమ మధ్య మాటలే కరువైపోయాయి. ఎప్పుడు చూసినా ఎవరో ఒకరితో సెల్‌లో మాట్లాడుతూనే వుంటాడు' అనుకుంటూ లోపలికి నడిచింది నీహారిక.

సాయంత్రం వచ్చేటప్పుడు అతిథులను వెంటబెట్టుకుని వచ్చాడు విహారి. వైజాగ్ నుండి స్నేహితులు వచ్చార్ర. అప్పటికప్పుడు వాళ్ళకి వంట చేసి వడ్డించి వాళ్ళు వెళ్ళేసరికి బాగా అలిసిపోయింది నీహారిక. భార్యకంటే ముందే పడుకున్నాడు విహారి.

బుధవారం రోజున ఎలాగైనా అతనితో మాట్లాడాలని అతను స్నానం చేస్తుండగా నీళ్ళగది తలుపు కొట్టింది.

అతను తలుపు కొద్దిగా తెరిచి ఏమిటన్నట్టు చూసాడు. ''వీపురుద్దమంటారా?'' అనడిగింది నీహారిక.

ఆమె మాటలు అతనికి వినబడలేదు. అప్పుడు గమనించింది అతను స్నానం ముగించి సెల్‌ఫోనులో మాట్లాడుతున్నాడు. విసుగ్గా ఆమె వైపు చూసి, సెల్‌ఫోనులో వ్యక్తికి 'ఒక్క క్షణం' అని చెప్పి ''ఏమిటే?'' అన్నాడు.

నీహారికకు మనసు చివుక్కుమంది ఏమీ లేదు అన్నట్టు తల అడ్డంగా తిప్పి విసురుగా వచ్చేసింది.

'లాభం లేదు. ఈ సెల్ విసిరి అవతల పారేయాల్సిందే.. లేదంటే..' అనుకుంటూ మామూలుగా వంటపనిలో మునిగిపోయింది.

విహారి కూడా హడావుడిగా ఆఫీసుకు తయారై ఎవరితోనో సెల్‌లో మాట్లాడుతూనే భార్యకు బై చెప్పి వెళ్ళిపోయాడే తప్ప బాత్‌రూం తలుపు కొట్టి మరీ మాట్లాడాలనుకున్న విషయమేమిటే అని ఆమెను అడగలేదు. అడగాలని అతనికి తోచలేదు.

ఇదిగో రాత్రి ఆమె పని ముగించుకుని వచ్చేసరికి నిద్రలో వున్నాడు. లేక నిద్ర నటిస్తున్నాడా అని తొంగి చూసి పడుకుంది నీహారిక.

గురువారం రోజున పగలంతా పరధ్యానంగా వున్నాడు విహారి.

సాయంకాలం ఏడు గంలటకే వచ్చేసాడు గానీ ఏదో టెన్షన్‌లో వున్నట్టు అటూ ఇటూ తిరుగుతూ మధ్యలో గడియారం వైపు చూస్తూ వున్నాడు.

అతన్ని పలకరించడానికి జంకింది నీహారిక. భోజనమయ్యేసరికి పది గంటలయింది.

వెంటనే సెల్‌ఫోన్‌ను పట్టుకుని బాల్కనీలోకి వెళ్ళి కూర్చున్నాడు. నీహారిక వంటిల్లు శుభ్రం చేస్తోంది.

పదిన్నరకు 'కలవరమాయే మదిలో!' అంటూ సెల్ ఫోను మోగింది.

''హలో'' అన్నాడు గొంతులో ఆదుర్దా కనబడనీయకుండా.

''నా ఫోను కోసమే ఎదురుచూస్తున్నట్టు టక్కున తీసారు.. థాంక్స్'' అంది తీయని స్వరం.

''చూడండి.. నేను టీన్స్‌లో వున్న కుర్రాడిని కాను ఇలాటి ఆటలు ఆడడానికి. మీరు ఎందుకిలా చేస్తున్నారో నాకేం తెలియడం లేదు..'' చిరాగ్గా అన్నాడు.

''ఏమీ తెలియకుండానే నన్ను తల్లిని చేసారన్న మాట. ఏం చతురులండీ..'' ఆవిడ కిసుక్కున నవ్వుతోంది.

''స్టాపిట్ ఐ.. సే.. ఇక ఈ పరాచికాలు మానితే మంచిది'' విహారి పళ్ళ బిగువన గొంతు పెంచకుండానే సాధ్యమైనంత కటువుగా అన్నాడు.

''అంత కోపమెందుకండీ? శుభవార్త చెప్తే సంతోషపడక.. సరే గానీ మీకు ఇద్దరూ అబ్బాయిలే కదా ఇప్పుడు మనకు గనుక కూతురు పుడితే బావుంటుంది కదండీ! ఒకవేళ కూతురే అయితే నాలాగా వుండాలా? మీ పోలికలో వుంటే ఇష్టమా?'' ఆమె కంఠంలో అల్లరి, చిలిపిదనం, కవ్వింత పోటీ పడుతున్నాయి.

విహారి చేతులు సెల్‌ఫోను మీద బిగుసుకున్నాయి.

''ఏమిటండీ మాట్లాడరు? ఊహల్లోకి వెళ్ళిపోయారా కొంపదీసి? మీకు సంతోషంగా వుందా లేదా చెప్పరేం?'' ఆమె వదలకుండా కవ్విస్తోంది.

విహారి కనుబొమలు ముడివడ్డాయి.

''ఆడపిల్ల పుడితే ఇంచక్కా రంగు రంగుల గౌన్లు, గాజులు, రిబ్బన్లు కొనొచ్చు. తలచుకుంటే ఆనందంగా లేదూ? అన్నట్టు పాప పుడితే పేరేం పెడతారు? వినీల అని పెడితే ఎలా వుంటుంది?'' నవ్వుతోంది ఆమె.

విహారి కళ్లు సంభ్రమాశ్చర్యాలతో పెద్దవయ్యాయి. ఒక్క ఉదుటున కుర్చీలో నుంచి లేచి బాల్కనీలో నుంచి వంటింటి వైపు పరిగెత్తాడు.

వంటింట్లో గ్యాస్ స్టౌ వైపు తిరిగి నిలబడి వున్న నీహారిక చేతిలోని సెల్‌ఫోన్‌లో కిలకిలా నవ్వుతోంది. సినిమాల ప్రభావంతో దానిమీద పల్చని రుమాలు పెట్టింది.

''ఓ మైగాడ్.. ఎందుకింత ప్రాక్టికల్ జోకు వేసావ్'' అంటూ భార్య భుజాలు పట్టి తన వైపు తిప్పుకున్నాడు విహారి.

''నేనేం జోక్ చేయలేదు'' అతని కళ్లలోకి చూసి చెప్పి సిగ్గుగా కళ్లు దించుకుంది నీహారిక.

''అయితే నిజంగా నిజమా? ప్రామిస్?'' ఆమె ముఖాన్ని తన రెండు అరచేతుల మధ్య పట్టుకుని అడిగాడు.

''అబ్బ వుండండీ.. ఫోనులో మాట్లాడుతున్నాను'' అంటూ విడిపించుకుంది.

''ఎప్పుడు తెలిసిందీ? ఎన్నాళ్లు వెయిట్ చేసాం మూడోసారి పాప పుడితే బాగుండుననీ.. పేరు కూడా సెలెక్ట్ చేసాం కదూ మనిద్దరి పేర్లు కలిసేలా..

ఇన్నాళ్లకు.. నిజమా? చూడనీ..'' భార్య పొట్ట మీద తల ఆన్చాడు.

''ఇన్నాళ్లు ఎందుకు చెప్పలేదు?'' గారంగా సెల్ ఫోన్లోనే అడిగాడు.

''మీతో మాట్లాడాలంటే వీలు దొరికితే కదా! ఎప్పుడూ ఆ సెల్‌లో మాట్లాడుతుంటారు. అందుకని నేను కూడా ఫోనులోనే మాట్లాడుదామనీ..'' సెల్‌లో కిలకిలా నవ్వుతోంది నీహారిక.

☆